చదువుతోనే గుర్తింపు, గౌరవం

- ఎమ్మెల్యే రేఖానాయక్
- ఊరూరా పాఠశాలల్లో విద్యాదినోత్సవం
- విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు

ఖానాపూర్: చదువుతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు సాధ్యమని.. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదవాలని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని మస్కాపూర్, సుర్జాపూర్ గ్రామాల్లో విద్యాదినోత్సవం నిర్వహించగా వారు హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా పాఠశాలలో చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం మనఊరు–మనబడి ద్వారా అభివృద్ధి చేస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. సర్పంచ్ అడిదెల మహేందర్, చెప్పాల అనురాధ, ఎంపీపీ మోహిద్, శంకర్, వెంకాగౌడ్, రామునాయక్, హెచ్ఎంలు బాలాజీ, శంకర్ తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల పాఠశాలల్లో జాతీయ జెండా ఆవిష్కరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీలు తీశారు. బడీడు పిల్లలను.. బడిలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పీచర, వడ్యాల్, రాచాపూర్, లక్ష్మణచాంద, బాబాపూర్ తదితర గ్రామాల్లో పాఠశాలల విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. అనంతరం పాఠశాలలో జాతీయజెండా ఆవిష్కరించారు. రాచాపూర్ (మహాత్మా జ్యోతిబాపూలే) పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంతోష్ జెండా ఎగురవేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముధోల్: మండలంలోని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు జాతీయజెండా జెండా ఆవిష్కరించారు. ఆయా గ్రామాల్లోని వీధుల్లో విద్యార్థులు ర్యాలీలు తీశారు. అనంతరం పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. ఎడ్‌బిడ్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ పాఠ్యాంశాలను ప్రారంభించి రాగిజావ పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు రవిబాబు, శ్రీనివాస్ తదితరులున్నారు.

సోన్: మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం ఉన్నత పాఠశాలలో జాతీయజెండాను ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసమూర్తి ఆవిష్కరించారు. ఈసందర్భంగా విద్యార్థులు ర్యాలీ తీశారు. ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. అనంతరం మనఊరు–మనబడి కార్యక్రమంలో చేపట్టిన ప్రగతి నివేదికను చదివి వినిపించారు. రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూంలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ అంకం జ్ఞానేశ్వర్, అంకం శ్రీనివాస్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

మామడ: మన ఊరు– మన బడిలో భాగంగా మండలంలోని కొరిటికల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతి గదిని మంగళవారం సర్పంచ్ భోజవ్వ ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల పాఠశాలల్లో జాతీయజెండా ఎగురవేశారు. విద్యార్థులకు పాటలు, ఉపన్యాసం, నృత్య పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు.

భైంసారూరల్: మండలంలోని మిర్జాపూర్ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతి ఫలితాల్లో 9.2 జీపీఏ సాధించిన లక్ష్మి అనే విద్యార్థిని సన్మానించారు. అనంతరం రూ.రెండు వేల నగదును అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ వినోద్, ప్రధానోపాధ్యాయులు విద్యాధర్, ఉపాధ్యాయులు కడారి దశరథ్, శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

తానూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాలల్లో జాతీయజెండా ఎగురవేశారు. తానూరులో జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలో ఆకట్టుకున్నారు. పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయులు సుభాష్, మోస్లే, భూమన్నయాదవ్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందించారు. స్థానిక కస్తూర్బాలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందించారు. పాఠశాల ప్రత్యేకాధికారి జ్యోతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

కడెం: మండల కేంద్రంతోపాటు పాత మద్దిపడగ జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి విద్యార్థులకు వ్యాసరచన, పాటలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కడెం పాఠశాలలో డిజిటల్ తరగతి ఏర్పాటుకు సహకరించిన కడెంకు చెందిన జెడ్పీ కోఆప్షన్ సభ్యులు రఫీక్ అహ్మద్‌ను సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్, హెచ్ఎంలు విజయస్వప్న, డీఎల్ఎన్‌చారి, పీడీ క్రాంతి తదితరులు ఉన్నారు.

లోకేశ్వరంలో..

లోకేశ్వరం: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో విద్యాదినోత్సవం నిర్వహించారు. లోకేశ్వరం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రమేశ్‌కుమార్ పాఠ్యపుస్తకాలు, ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



ఖానాపూర్: మస్కాపూర్‌లో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్



కడెం: పాతమద్దిపడగ పాఠశాలలో..



మామడ: కొరిటికల్‌లో డిజిటల్ తరగతి గది ప్రారంభిస్తున్న సర్పంచ్ భోజవ్వ



భైంసా కస్తూర్బాలో పుస్తకాలు పంపిణీ చేస్తూ..



ముధోల్‌లో ర్యాలీ తీస్తున్న విద్యార్థులు



లోకేశ్వరంలో మాట్లాడుతున్న రమేశ్‌కుమార్



తానూరులో ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణ



సోన్: న్యూవెల్మల్ బొప్పారం పాఠశాలలో..



లక్ష్మణచాంద: పీచరలో ర్యాలీలో విద్యార్థులు

క్లుప్తంగా

'రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి'

భైంసాటౌన్: ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతాంగానికి ఇబ్బంది లేకుండా సరిపడ విత్తనాలు, ఎరువులు, రుణాలు అందించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజు డిమాండ్ చేశారు. మంగళవారం భైంసాలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. నకిలీ విత్తనాలు అరికట్టి రైతులు మోసపోకుండా చూడటంతోపాటు ఎరువుల కొరత లేకుండా చూడాలని వినతిపత్రంలో కోరారు. రూ.లక్ష రుణమాఫీకి సంబంధం లేకుండా రైతులకు రుణాలు సకాలంలో అందించాలని కోరారు. దీనాజీ, ముత్తన్న, ఎల్లన్న, సంతోష్ తదితరులు ఉన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్

నిర్మల్‌టౌన్: పట్టణ శివారులోని చించోలి చౌరస్తా సమీపంలో ఆధునిక వసతులతో నిర్మించిన మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌ను మంగళవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. విద్యా దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమంలో తరగతి గదులతోపాటు, హాస్టల్ భవన సముదాయాన్ని మంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా కాంట్రాక్టర్ లక్కడి జగన్‌మోహన్ సోదరులను మంత్రి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, వెంకట్రామ్‌రెడ్డి, పోశెట్టి ఉన్నారు.

'అక్రమ గోరవాణా అరికట్టాలి'

నిర్మల్‌చైన్‌గేట్: బక్రీద్ సందర్భంగా అక్రమ గోరవాణా, గోవధను అరికట్టాలని హిందు వాహిని నిర్మల్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో డీఎస్పీ, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్‌కు వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చట్ట వ్యతిరేక చర్యలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని.. అనుమతి లేని గోవధశాలలను మూసివేయించి పికెటింగ్, చెక్ పోస్ట్ ఏర్పాటు చేయాలని కోరారు. హిందువాహిని జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల హరీశ్, రాము, మనోహర్, వినోద్, పట్టణ అధ్యక్షులు పవన్, సహ సంయోజక్ మనోజ్, ఆకాశ్, ముకేశ్, మహేశ్ పాల్గొన్నారు.

27మందికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 27 మందికి జరిమానా, ఇద్దరికీ మూడు రోజుల సాధారణ జైలుశిక్ష విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుబడిన వారిని నిర్మల్ కోర్టులో హాజరుపరిచారు. 27మందికి రూ.23,600 జరిమానా విధిస్తూ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి అజీజ్ రహేమాన్ తీర్పునిచ్చారు.

పట్టణ సీఐగా పురుషోత్తం

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణ సీఐగా పురుషోత్తంచారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ టూ టౌన్ సీఐగా పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ సీఐగా పని చేసిన మల్లేష్ నిజామాబాద్ పీసీఆర్‌కు బదిలీ అయ్యారు. నూతన సీఐని ఎస్సైలు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రూ.పదివేలు అందజేత

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతిలో టాపర్‌గా నిలిచిన శ్రీపాద సుధీక్షకు మంగళవారం గ్రామానికే చెందిన బాశెట్టి శివ రూ.10వేల బహుమతి అందజేశారు. గతంలో టాపర్‌కు బాశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.పది వేల బహుమతి ఇస్తానని ప్రకటించారు. సర్పంచ్ మహేందర్, ఎంపీటీసీ పుప్పాల స్వప్న, హెచ్ఎం బాలాజీ, ఎస్ఎంసీ చైర్మన్ పుప్పాల కృష్ణ, తదితరులు ఉన్నారు.

బలోపేతానికి కృషి చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఆమ్ ఆద్మీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి కన్వీనర్ దిద్ది సుధాకర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ సయ్యద్ హైదర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బస్తీబాటలో ఆయన పాల్గొన్నారు. పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించి అంబేద్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ కాలనీలో ఏర్పాటు చేసిన బస్తీబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బూర రాము, మహమ్మద్ మాజిద్, సుభాష్, జిల్లా కోఆర్డినేటర్లు, నియోజకవర్గాల ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

అర్చకుడికి సత్కారం

భైంసా: బాసరలోని పాపహరేశ్వర ఆలయ అర్చకుడు శివశ్రీ జంగం నగేశ్‌అప్పను మంగళవారం హైదరాబాద్‌లో ఘనంగా సత్కరించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ సరస్వతి పరిషత్ త్రినయన సాంస్కృతిక కళా నిలయం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటుచేశారు. జంగం నగేశ్‌అప్పకు వైదిక పురోహిత్ విభభూషన్ రత్న బిరుదు ఇచ్చి నంది అవార్డు అందించారు.

ఇంకుడుగుంత నిర్మించుకోవాలి

కుంటాల: వర్షపునీటిని ఒడిసి పట్టి భూగర్భజలాలు పెంచేందుకు ఇంటింటా ఇంకుడుగుంత నిర్మించుకోవాలని ఏపీవో గట్టుపల్లి నవీన్ పేర్కొన్నారు. మంగళవారం కుంటాలలో ఇంకుడుగుంతల నిర్మాణం పరిశీలించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి రాజబావు, ఫీల్డ్‌అసిస్టెంట్ రాజేశ్వర్, దిలీప్ పాల్గొన్నారు.

సవరణలు చేసుకోవాలి

ఖానాపూర్: ఓటరుకార్డులో తప్పులుంటే సరి చేసుకోవాలని బీఎల్‌వోలు ఆర్. విజయలక్ష్మి, మమత అన్నారు. మంగళవారం పట్టణంలోని రాజీవ్‌నగర్, సుభాష్‌నగర్ కాలనీల్లో ఇంటింటా తిరుగుతూ ఓటర్లకు అవగాహన కల్పించారు.

నేడు వారసంత ప్రారంభం

కుంటాల: మండలంలోని ఓలా బస్టాండ్ ఆవరణలో బుధవారం ఉదయం 11గంటలకు వార సంత ప్రారంభిస్తున్నట్లు సర్పంచ్ కనీష్‌ఫాతిమా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు వార సంతను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు యోగా దినోత్సవం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వశిష్ఠ యోగ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే యోగా దినోత్సవంలో పాల్గొనాలని నిర్వాహకులు శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు కార్యక్రమం మొదలవుతుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సోన్: జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల, జూనియర్ కళాశాలలో తాత్కాలిక పద్ధతిన అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మేరీ ఏసుపాదం ఓ ప్రకటనలో తెలిపారు. జూనియర్ లెక్చరర్(07), పీజీటీ(03), టీజీటీ(05), పీఈటీ(02), అసిస్టెంట్ కేర్ టేకర్(02) పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి 50 శాతం మార్కులతో పీజీ, బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హులు ఈనెల 26లోగా దరఖాస్తు అందించాలన్నారు. పూర్తి వివరాలకు 7995010575 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మున్సిపల్ చైర్మన్ పర్యటన

నిర్మల్‌టౌన్: పట్టణంలోని సోఫినగర్ కాలనీ లో మంగళవారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పర్యటించారు. ఈసందర్భంగా మురికి నీటి నాలాలు, రోడ్లపై పెరిగిన పిచ్చి మొక్కలను, బండ రాళ్లను తొలగించాలని స్థానికులు కోరారు. సమస్య పరిష్కరిస్తామని చైర్మన్ పేర్కొన్నారు. వారి వెంట కౌన్సిలర్ అబ్దుల్ మతిన్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

విత్తే కాలం.. జర పైలం

- గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవోలు
- విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని సూచన
- నకిలీ వ్యాపారుల వద్ద కొని మోసపోవద్దంటున్న అధికారులు



పెంబి మండలం ఇటిక్యాలతండాలో చేను వద్ద అవగాహన కల్పిస్తున్న ఏఈవో రాజ్‌కుమార్

పెంబి: విత్తుకొద్ది ఫలం అంటారు పెద్దలు.. రైతులు సాగు చేసే పంటకు నాణ్యమైన విత్తనం ఎంచుకుంటే మంచి దిగుబడి వస్తుంది. నాసిరకం(నకిలీ) విత్తనం విత్తితే శ్రమ వృథా కావడంతోపాటు పెట్టుబడులు నష్టపోతారు. ఖరీఫ్ సీజన్ పనులు ప్రారంభం కావడంతో విత్తనాల ఎంపిక, కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ అధికారులు పలు సూచనలు చేస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

విత్తే ముందు మొలక శాతం పరీక్ష చేసుకోవాలి..

రైతులు ఫెర్టిలైజర్ దుకాణాల్లో కొన్న విత్తనాలను నేరుగా చేనులో విత్తుకోకుండా ముందుగా ఇంటి వద్ద మొలకశాతం పరీక్ష చేసుకోవాలి. ఏయే పంట విత్తనాలైనా ప్యాకెట్‌లోని వంద గింజలను తీసుకొని నాటినట్లయితే వరిలో 80శాతం, మొక్కజొన్న 90శాతం, పత్తి 65శాతం, నూనె గింజలు 70శాతం మొలకలు వచ్చినట్లయితేనే చేనులో విత్తుకోవాలి. మండలంలో 20,013 ఎకరాల్లో సాగు భూమి ఉండగా వర్షాధార భూమి 7,113 ఎకరాలు, చెరువులు, బావుల ద్వారా 12,900 ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని వ్యవసాయాధికారులు తెలిపారు.

లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే కొనాలి..

ప్రభుత్వం నుంచి అధికారికంగా విత్తన లైసెన్సులు పొందిన డీలర్ల వద్దనే కొనడం వలన రైతులు మోసాల బారి నుంచి తప్పించుకోవచ్చు. విత్తన ప్యాకెట్లు చిరిగిన లేదా తెరిచి ఉన్న తిరస్కరించడమే ఉత్తమం. విత్తన ప్యాకెట్లపై విత్తన రకం, మొలక శాతం, స్వచ్ఛత శాతం, లాట్ నంబర్, అమ్మకం ధర, విత్తన పరీక్ష చేసిన తేది వంటి వివరాలు ఉన్నాయో లేదో చూసుకొని కొనుగోలు చేయాలి. లేబుల్ రూపంలో లేకపోతే నకిలీవని గుర్తించాలి. ప్యాకెట్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే విత్తనానికి సంబంధించిన కంపెనీ, విత్తన వివరాలు తెలుసుకోవచ్చు.

తక్కువకు వస్తున్నాయని కొనొద్దు..

లైసెన్స్ దుకాణాల్లో కాక అంగటో తక్కువ ధరకు విత్తనాలు అమ్మితే కొనవద్దని రైతులకు సూచిస్తున్నారు. అనుమానితులెవరైనా విత్తనాలు అమ్మినట్లు కనిపిస్తే వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకురావాలని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

తొందరపడి విత్తుకోవద్దు

తొలకరి వర్షాలు కురవకుండా రైతులు తొందరపడి విత్తనాలు విత్తుకోవద్దని ఏఈవో రాజ్‌కుమార్ అన్నారు. జూలై 15వరకు విత్తనాలు వేసుకోవచ్చని.. వాతావరణ సమాచారం తెలుసుకునేందుకు మౌసం, మేఘదూత్, టీఎస్‌డీపీయస్ వంటి యాప్‌లు వినియోగించాలన్నారు.

రశీదు భద్రపరుచుకోవాలి

ఫెర్టిలైజర్ దుకాణాల్లో విత్తనాలు కొన్న సమయంలో తీసుకున్న రశీదును పంట చేతికొచ్చే వరకు భద్రపర్చుకోవాలి. తక్కువ దిగుబడి వచ్చి విత్తనం నకిలీదని తేలితే అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటాం. రసీదులు ఉంటేనే పరిహారం పొందే వీలుంటుంది. మరోవైపు వర్షాలు కురవనిదే.. తొందర పడి రైతులు పొడి దుక్కిలో విత్తనాలు విత్తుకో వద్దు. వ్యవసాయాధికారుల సలహాలు పాటించాలి.

– రాజ్‌కుమార్, ఇటిక్యాల్ ఏఈవో

బహుమతులకు మోసపోవద్దు



పలాన విత్తనాలు కొంటే బహుమతులు ఇస్తామంటూ ఊర్లలో తిరుగుతూ అమ్మే నకిలీ వ్యాపారుల వద్ద కొనవద్దు. రహస్యంగా విత్తనాలు అమ్మితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. నకిలీ విత్తనాల బారిన పడకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి.

– రజనీకాంత్, పెంబి ఎస్సై

అవగాహన కల్పిస్తున్నారు



మాకున్న మూడెకరాల్లో పత్తి పంట వేయాలనుకుంటున్నాం. వ్యవసాయాధికారులు విత్తనాలు కొనే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విత్తే ముందు అధికారుల సలహాలు తీసుకుంటాం. వారు అందుబాటులో ఉంటూ సూచనలు ఇస్తున్నారు.

– కదావత్ నిర్మల, మహిళా రైతు, తాటిగూడ

'కమీషన్ వివరాలు తేల్చాలి'

దస్తురాబాద్: దళితబంధు పథకంలో నాయకుల కమీషన్ల వివరాలు తేల్చాలని ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దళితబంధు అప్లికేషన్ భరోసా నిర్వహించారు. సుమారు 60 మంది దళితబంధు దరఖాస్తులను నింపి తహసీల్దార్ లక్ష్మికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితబంధు ఇప్పిస్తామని చెప్పి ప్రజాప్రతినిధులు మున్యాల, గొడిసిర్యాల, బుట్టాపూర్, ఆకొండపేట, భూత్కూర్ గ్రామాల్లో దళితబంధు ఇప్పిస్తామని దళితుల నుంచి రూ.లక్షలు వసూలు చేశారని ఆరోపించారు. సంతోష్, సంజీవ్, శంకరయ్య, నితిన్, రంజిత్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

'ఓర్వలేకనే అవిశ్వాసం'

ఖానాపూర్: పద్మశాలి కులానికి చెందిన మున్సిపల్ చైర్మన్ రాజేందర్.. రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేకనే అతడిపై అవిశ్వాసం ప్రవేశపెట్టారని తిమ్మాపూర్ పద్మశాలి సంఘం నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని తిమ్మాపూర్ సంఘ భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులంతా పద్మశాలి నేతపై చేస్తున్న కుట్రలను తాము ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో నారాయణ, షట్పల్లి దత్తాద్రి, అంకం మహేందర్, కిషన్, రాజేశ్వర్, లక్ష్మన్, సునీల్, రాంప్రసాద్, శంకర్, రవీందర్, రాజన్న తదితరులు ఉన్నారు.

'విభేదాలు సృష్టించొద్దు'

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణంలో అవినీతి, కుంటుపడ్డ అభివృద్ధిని నిరసిస్తూ పార్టీలకు అతీతంగా కౌన్సిలర్లు చైర్మన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే.. కొందరు నాయకులు విభేదాలు సృష్టించడం సరికాదని పలువురు ముస్లిం, మైనార్టీ నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అవిశ్వాసం అనేది వర్గాలకు వర్తించేది కాదని.. ఖానాపూర్‌లో అన్ని వర్గాల ప్రజలు ఐక్యమత్యంతో ఉన్నారన్నారు. వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం అంటూ ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. జహీర్ అహ్మద్, అర్బాత్ మసీదు అధ్యక్షుడు సయ్యద్ యూనుస్, సలీంఖాన్, షౌకత్ పాషా, రషీద్, యూసుఫ్, రజాక్, ఆసిఫ్ ఉన్నారు.

కేంద్ర పథకాలే గెలిపిస్తాయి

లోకేశ్వరం: కేంద్ర ప్రభుత్వ పథకాలే బీజేపీ నాయకుల్ని గెలిపిస్తాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భోస్లే మోహన్‌రావుపటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని బ్రహ్మేశ్వరాలయంలో పూజలు చేశారు. అనంతరం కన్కపూర్‌లో పల్లెపల్లెకు బీజేపీ–గడప గడపకూ మోహన్‌రావుపటేల్ కార్యక్రమం నిర్వహించారు. సుమన్‌కుమార్, సుభాష్ పటేల్, నరహరి, అనిల్, లింగాల పోతన్న, భూమన్న ఉన్నారు.

కుటుంబాన్ని ఆదుకోవాలి

ఖానాపూర్: హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం మరిపెల్లిగూడెంలో జరిగిన దశాబ్ది ఉత్సవాల ర్యాలీలో ట్రాక్టర్ కింద పడి మృతి చెందిన బాలుడి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి మల్లెపల్లి స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

మరింత అభివృద్ధి చేస్తాం.. ఆశీర్వదించాలి



పార్డి(బి)లో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి

కుభీర్: రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని.. ప్రజలు ఆశీర్వదించాలని ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పార్డి(బి)లో మనఊరు– మన బడిలో భాగంగా రూ.39 లక్షలతో నిర్మించిన పాఠశాల భవనంతోపాటు రూ.2.5లక్షలతో నిర్మించిన స్వాగత తోరణం ప్రారంభించారు. కుభీర్‌లో రూ.15లక్షలతో నిర్మించిన గ్రంథాలయం.. దావుజీ నాయక్‌తండాలో రూ.16లక్షలతో నిర్మించిన పాఠశాల భవనం ప్రారంభించారు. బెల్గాంలో రూ.74లక్షలతో నిర్మించే పాఠశాల భవనానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పని చేసిన వారిని ప్రజలు తప్పక ఆదరిస్తారని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ తూము లక్ష్మిబాయి, జెడ్పీటీసీ అల్కాతాయి, చవాన్ శంకర్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అనిల్, పీరాజీ, సర్పంచ్‌లు పుష్ప, మీరా, శంకర్, ఎంపీటీసీ పోసానిబాయి ఉన్నారు.

నాడు తల్లి.. నేడు తండ్రి

- రిమ్స్‌లో చికిత్స పొందుతూ ధార్‌కుభీర్‌కు చెందిన రిమాండ్ ఖైదీ మృతి
- అనాథలైన ఇద్దరు చిన్నారులు



మహేశ్(ఫైల్)



అనాథలైన చిన్నారులు

కుభీర్: మండలంలోని దార్‌కుభీర్ గ్రామానికి చెందిన బంక మహేశ్(30) అనే రిమాండ్ ఖైదీ ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన బంక లావణ్య– మహేశ్ దంపతులు కాగా వీరికి శాన్వి(3), అనుష్క(1) అనే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసైన మహేశ్ తాగి తన అన్నలను వేధిస్తూ కొడుతుండేవాడు. దీంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మండల ఎస్సై షరీఫ్ ఈనెల 13న రిమాండ్‌కు నిర్మల్ సబ్‌జైలుకు పంపారు. అక్కడ మూర్చ(ఫిట్స్) రావడంతో జైలు అధికారులు చికిత్స కోసం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం చనిపోయాడు. ఆరు నెలల కిందట తల్లి ఆత్మహత్య చేసుకోవడం.. ప్రస్తుతం తండ్రి మరణించడంతో వారి ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. అతడి అంత్యక్రియలు గ్రామంలోనే నిర్వహించారు.

'ఎంపీ సోయంపై చర్యలు తీసుకోవాలి'

నిర్మల్‌చైన్‌గేట్: ఎంపీ ల్యాడ్స్ నిధులు కాజేసిన ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావుపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ దివ్యాంగ పునరావాస అభివృద్ధి ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సట్టి సాయన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో తెలంగాణ దివ్యాంగ పునరావాస అభివృద్ధి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా దివ్యాంగులకు నిధుల్లో ఒక్క రుపాయి ఖర్చు చేయలేదన్నారు. ఎంపీ నిధులకు సంబంధించి వెంటనే ఎంపీ శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, సాయన్న, రమేశ్, లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్, బహుజన ముక్తి పార్టీ జిల్లా అధ్యక్షులు కె.సూర్యకాంత్ పాల్గొన్నారు.

టీ–9 టికెట్లు అందజేత

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం మహిళలు, వృద్ధుల కోసం ప్రవేశపెట్టిన టీ–9 టికెట్లను డీఎం అమృత ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులకు టిక్కెట్లు అందించారు. వారి వెంట సిబ్బంది కిషన్ ఉన్నారు.